శిథిలావస్థలో ఎస్సీ బాలుర వసతి గృహం

- విరిగిన తలుపులు, కిటికీలు
- పాడైపోయిన మరుగుదొడ్లు
- భవన నిర్మాణం కోసం కొత్త ప్రభుత్వంపై ఆశలు


భవనం పిల్లర్‌కు సిమెంట్ ఊడిపోయిన దృశ్యం

హయత్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : హయత్‌నగర్ డివిజన్ పద్మావతి కాలనీలో 40 సంవత్సరాల క్రితం నిర్మించిన సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. రెండు దశాబ్దాలుగా తాత్కాలిక మరమ్మతులతో కాలం వెళ్లదీస్తున్నారు. శిథిల భవనంలోనే విద్యార్థులు భయంగా భయంగా గడుపుతున్నారు. అప్పట్లో కాంగ్రెస్ హయాంలోనే ఇక్కడ వసతి గృహాన్ని నిర్మించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భవనం గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హాస్టల్‌కు కొత్త భవనాన్ని నిర్మిస్తారని విద్యార్థులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. వర్షాకాలంలో ఏ క్షణాన భవనం కూలుతుందోనన్న భయంతో విద్యార్థులు ఉన్నారు. భవనం పాతబడడంతో తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. మరుగుదొడ్లు పాడైపోయాయి. తలుపులకు రంధ్రాలు పడ్డాయి. భవనం గోడలపై నాచు పెరుగుతోంది. గోడల పెచ్చులు ఊడి పడుతున్నాయి. హాస్టల్ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పరిసరాల్లో దుర్గంధం, దోమల బెడదతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



పద్మావతి కాలనీలో శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలుర హాస్టల్, గోడలకు ఏర్పడిన నాచు

ప్రతి ఏటా నీట మునగడం ఖాయం..?

ఎస్సీ బాలుర వసతి గృహం ప్రతి వర్షాకాలంలో నీట మునుగుతోంది. వర్షానికి పైన ఉన్న కాలనీల నుంచి వచ్చే నీరంతా హాస్టల్‌లోకి చేరుతుంది. దీంతో విద్యార్థులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అనారోగ్యానికి గురవుతున్నారు. హాస్టల్ భవన నిర్మాణ సమయంలో ఎత్తు పెంచకుండా భూమికి సమాంతరంగా నిర్మించారు. దీంతో చిన్నపాటి వర్షానికే నీరు హాస్టల్‌లోకి చేరుతుంది. దీంతో గోడలు తడిసి నాణ్యత కోల్పోయాయి. హాస్టల్ గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి.

హాస్టల్‌లో 80 మంది విద్యార్థులు

ఎస్సీ బాలుర వసతి గృహంలో 6 నుంచి 10వ తరగతి చదువుకునే 80 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరంతా దూర ప్రాంత జిల్లాలకు చెందిన వారు. ప్రమాదం అంచున ఉన్న హాస్టల్ భవనాన్ని చూసి విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే ప్రభుత్వం స్పందించి కొత్త భవనం నిర్మించాలని వారు కోరుతున్నారు.



ఎగ్జిబిషన్‌లో చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్

వనస్థలిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటుచేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అండ్ సేల్ మేళా విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్స్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్స్, లక్నో చికెన్, బెనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్ అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని అక్బర్ అలీ పేర్కొన్నారు.


యోగా శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

యోగా సాధనతో మానసిక ఒత్తిడి దూరం

మన్సూరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా సాధన చేయాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. శ్రీసత్యసాయి ధ్యాన మండలి నిర్వాహకులు పూజ్యశ్రీ భిక్షమయ్య గురూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను శ్రీనివాస్‌గుప్తా బుధవారం నాగోల్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ నెల 21న చిత్రా లేవుట్‌లో, 23న హస్తినాపురంలోని పద్మపాణి ఆచార్య కమ్యూనిటీహాల్, 25న దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో ఉచితంగా యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యోగా రత్న అవార్డు గ్రహీత ఇస్మాయిల్ గురూజీ, జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, రామచందర్‌రావు, బూర మల్సూర్‌గౌడ్, శ్రీనివాసులు, నరేందర్, ఉపేందర్ పాల్గొన్నారు.


మాజీ కౌన్సిలర్ పేరుతో ఉన్న శిలాఫలకం కనిపించకుండా పోసిన మట్టి కుప్ప

కౌన్సిలర్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- మాజీ కౌన్సిలర్ చెరుకూరి రేణుక జగన్ హితవు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ బొర్ర అనురాధసురేష్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఆ వార్డు మాజీ కౌన్సిలర్ చెరుకూరి రేణుకజగన్ హితవు పలికారు. బుధవారం పెద్దఅంబర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత పాలకవర్గంలో తాను కౌన్సిలర్‌గా చేసిన అభివృద్ధిని చూసి ప్రస్తుత కౌన్సిలర్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. అప్పటి పాలకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలు కనిపించకుండా వాటిపై మట్టిపోయిస్తూ ప్రస్తుత కౌన్సిలర్ అవమానపరుస్తున్నారని ఆరోపించారు. కౌన్సిలర్ తన అనుచరులతో ఈ పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్ల వద్ద కమిషన్‌ల కోసం మంచిగా ఉన్న సీసీ రోడ్డులను తవ్వించి వాటి స్థానంలో కొత్తవి వేయిస్తున్నారని విమర్శించారు. చిల్లర రాజకీయాలు మానుకుని వార్డు అభివృద్ధిపై దృష్టి పెడితే బాగుంటుందన్నారు.


తహసీల్దార్ రవీందర్‌దత్తుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చెరువు శిఖం కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

- తహసీల్దార్‌కు సీపీఎం వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెరువు శిఖం భూమిని కబ్జా చేస్తూ అక్రమంగా రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్తుకు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ తారామతిపేటలోని పోల్కమ్మ చెరువు శిఖం భూమిని కబ్జా చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా రోడ్డును వేశారని తెలిపారు. ఇరిగేషన్ శాఖ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అక్రమంగా వేసిన రోడ్డును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివకుమార్, యాదయ్య, శివ పాల్గొన్నారు.


కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, ఇతర నేతలు (సైదాబాద్, ఆంధ్రజ్యోతి)

గ్రిల్ హౌస్ హోటల్ సీజ్

- లైసెన్స్ రద్దు..
- 17 మంది బాధితుల్లో ఆరుగురు డిశ్చార్జి
- మరో 11 మంది కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స

అల్వాల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అల్వాల్, లోతుకుంటలోని గ్రిల్‌హౌస్ హోటల్ లైసెన్స్‌ను జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం రద్దు చేయడంతో పాటు సీజ్ చేశారు. హోటల్ యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ నెల 13న గ్రిల్‌హౌస్‌లో కొంత మంది స్థానికులు షవర్మా తిన్నారు. వారిలో మొదట నలుగురు అస్వస్థకు గురికాగా తాజాగా మరో 13 మందికి విరేచనాలు, వాంతులయ్యాయి. వారంతా బొల్లారం కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. మరికొంతమంది సుచిత్రలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో కోలుకున్న ఇద్దరిని డిశ్చార్జ్ చేశారు. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆరుగురిని డిశ్చార్జ్ చేయగా, మరో 11 మంది బొల్లారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.


అస్వస్థకు గురై బొల్లారం కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రక్త పరీక్షల్లో సాల్మొనెల్లా బ్యాక్టీరియా

బాధితులు అస్వస్థతకు గురికావడానికి కారణాలు తెలుసుకోవడానికి రక్త పరీక్షలు నిర్వహించగా సాల్మొనెల్లా బ్యాక్టీరియా ఉన్నట్లు తేలిందని జీహెచ్ఎంసీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. గుడ్డులోని పచ్చసొన, నిమ్మరసం, నూనెను మిక్సీలో వేసి తెల్లని మయోనైస్‌ను తయారుచేస్తారు. గుడ్డుపై కోళ్ల రెట్ట ఉంటుంది. వాటిని శుభ్రం చేయకుండానే మిక్సీలో వేస్తారు. కొన్నిసార్లు గుడ్డు షెల్ కూడా అందులో పడుతుంది. పరిశుభ్రత పాటించకపోవడం కారణంగా అలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు.



గ్రిల్ హౌజ్ హోటల్ సీజ్ చేసిన అధికారులు

మయోనైస్‌ను నిల్వ చేస్తే అంతే..!

గుడ్డుకు బదులు సోయాబీన్స్‌తో కూడా మయోనైస్‌ను తయారు చేసుకోవచ్చని నగరంలోని హోటళ్ల యజమానులకు వివరించామన్నారు. వెజ్ మయోనైస్‌తో పోల్చుకుంటే గుడ్డుతో తయారు చేసిన మయోనైస్ రుచిగా ఉండటంతో షవర్మా, పిజ్జాలు, ఎగ్‌బర్గర్, వెజ్‌బర్గర్ తదితర వాటిలో వీటిని ఉపయోగిస్తారని లక్ష్మీకాంత్ వివరించారు. తయారు చేసిన మయోనైస్ వెంటనే ఉపయోగించాలని, నిలువ ఉంచి వినియోగిస్తే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. ఇక నుంచి ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు చేస్తామన్నారు. గ్రిల్ హౌస్ యజమాని తౌఫిక్‌పై కేసు నమోదు చేసినట్లు అల్వాల్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్ రాహుల్‌దేవ్ తెలిపారు.

వక్ఫ్‌బోర్డు అధికారులపై దాడికి యత్నం

సైదాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు అధికారులపై దాడికి యత్నించిన 70 మందిపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెయిన్‌బజార్‌లో వక్ఫ్‌బోర్డుకు చెందిన మసీదు, దర్గా..రౌజతుల్ హదీప్, బాకర్ హుస్సేన్ కుటుంబసభ్యుల నిర్వహణలో ఉంది. దీనికి సంబంధించిన వివాదం కోర్టులో నడుస్తున్నది. దర్గా సమీపంలోని ప్రదేశంలో అక్రమ పార్కింగ్, జంతువులను కట్టివేయడంపై స్థానికులు వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 11న వక్ఫ్‌బోర్డు నియమించిన ముతవలి ఖుర్షీద్ జహాన్, ఇతర అధికారులతో దర్గాను సందర్శించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న బాకర్ హుస్సేన్, అతడి కుటుంబసభ్యులు, ఇతరులు సుమారు 70 మంది దుర్భాషలాడుతూ అధికారులపై దాడికి యత్నించారు. ఈ ఘటనపై ముతవలి ఖుర్షీద్ జహాన్ ఈ నెల 15న మాదన్నపేట పోలీసులపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం 11 కేవీ రజానగర్, కుమార్‌వాడి ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, అరుంధతి కాలనీ, హబీబ్‌నగర్, ఫతేషానగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, జోరాబీనగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు, యాస్రాఫ్‌నగర్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంతరెడ్డి తెలిపారు.

సంతోష్‌నగర్: టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11 కేవీ గంగ హాస్పటల్, సిరీస్, హరిపురి, జేపీకాలనీ, జీఎస్‌ఐకాలనీ, జైన్‌మందిర్, యాదవనగర్, బ్యాంక్‌కాలనీ, హిందు హరణ్య, విష్ణు థియేటర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో చెట్లు కొట్టివేత, నిర్వహణ పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈ తెలిపారు. గంగ హాస్పటల్, సిరీస్, హరిపురి, జేపీకాలనీ, జీఎస్‌ఐకాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సిరీస్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, జీఎస్‌ఐకాలనీ, జైన్‌మందిర్, యాదవనగర్, బ్యాంక్ కాలనీ, హిందు హరణ్య ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు, విష్ణు థియేటర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

మైనారిటీ గురుకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పరిధిలోని తొమ్మిది మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె.నవీన్ కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని హయత్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలాపూర్ (బాలురు), ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, హయత్‌నగర్, ఫరూఖ్‌నగర్, మొయినాబాద్ (బాలికల) కళాశాలల్లో మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూప్‌లు, 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, 6,7,8వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీలను (మైనారిటీలకు మాత్రమే) భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నిథమ్ డైరెక్టర్‌ను తొలగించాలి

రాయదుర్గం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నిథమ్ డైరెక్టర్ చిన్నంరెడ్డిని తొలగించి నిథమ్‌ను కాపాడాలని ఉద్యోగులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పలువురు ఉద్యోగులు, సిబ్బంది మాట్లాడుతూ.. చిన్నంరెడ్డిని వెంటనే తొలగించి నిథమ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందేలా చూడాలని కోరారు. నిరసనలు ఆపకపోతే మెమోలు జారీ చేస్తామని బెదిరిస్తున్నాడని తెలిపారు. పై అధికారులు స్పందించి చిన్నంరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కిడ్నీ మార్పిడి విజయవంతం

బంజారాహిల్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): థ్రాంబోటిక్ మైక్రో అంజియోపతి(టీఎంఎ) సిండ్రోమ్ లక్షణాలతో కిడ్నీ వ్యాధి చివరి దశలో ఉన్న రోగికి వైద్యులు విజయవంతంగా మూత్ర పిండాల మార్పిడి పూర్తి చేశారు. బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి నెఫ్రాలజీ టీమ్ హెడ్ డాక్టర్ కేఎస్ నాయక్, డాక్టర్ నవీన్ కుమార్ మట్టివాడ, సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ నవీన్ మెడి వివరాలు వెల్లడించారు. 'జార్ఖండ్ జమ్తారాకు చెందిన రామన్ కుమార్ సింగ్(37) మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్నారు. స్థానికంగా ఓ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోగా ఆయనకు మూత్రపిండ మార్పిడి తప్పనిసరి అని వైద్యులు తేల్చారు. తన సోదరి మూత్రపిండం ఇచ్చేందుకు సిద్ధ పడింది. ఇద్దరి బ్లడ్ గ్రూప్ వేర్వేరు కావడంతో కిడ్నీ అమర్చడం సమస్యగా మారింది. దీన్నే వైద్య పరిభాషలో థ్రాంబోటిక్ మైక్రో అంజియోపతి సిండ్రోమ్ అంటారు. దీంతో రోగిని మెరుగైన వైద్యం నిమిత్తం విరించి ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు కిడ్నీ మార్పిడి చేస్తే భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను విశ్లేషించారు. అనంతరం కిడ్నీని విజయవంతంగా మార్పిడి చేశారు. రోగి వేగంగా కోలుకున్నారని వైద్యులు తెలిపారు


శస్త్ర చికిత్స చేయించుకున్న వ్యక్తితో వైద్యులు

ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో...

21న ప్రకృతి విజ్ఞాన చికిత్సపై జాతీయ సదస్సు

పంజాగుట్ట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ యోగ విద్యాలయం, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని రామచంద్ర ప్రకృతి ఆశ్రమంలో ఈ నెల 21న ప్రకృతి విజ్ఞాన చికిత్సపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సదస్సులో వంద రకాల దేశవాళీ బియ్యం, వంద రకాల కూరగాయల దేశవాళి విత్తనాలు, మట్టి కుండల తయారీ, సహజ రంగులు, ఖాదీ, చేనేత, తాటి ఆకుల బొమ్మలు, ఔషధ మొక్కలు, గానుగ నూనె, సిరి ధాన్యాలు, ఇతర ప్రదర్శనలు, అమ్మకాలు చేస్తామన్నారు. ప్రముఖుల సందేశాలు, ప్రకృతి వైద్యం ద్వారా చికిత్స పొంది వ్యాధులు తగ్గిన వారి అనుభవాలను పంచుకోవడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాంధారి ప్రభాకర్, మహిళా కన్వీనర్ యానాల రాధిక, ప్రతినిధులు గిరిధర్, టి.సురేందర్, సుభాష్, గోవర్ధన్, సాయితేజ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సదస్సు పోస్టరును ఆవిష్కరిస్తున్న గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి, తదితరులు

రజనీ గంగాధర్ రచనలు ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పూసల ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ప్రముఖ రచయిత పూసల రజనీగంగాధర్ రచించిన సామెత కథలు కథాసంపుటి, పద్మసౌరభం పద్యసంపుటి, గానగంధర్వ ఘంటసాల హరికథా సంపుటి ఆవిష్కరణ బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి జల్ది విద్యాధర రావు పాల్గొని సంపుటాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వాడుకలో తెలుగులో ఉన్న సామెతలను కథల రూపంలో రజనీ గంగాధర్ వెలువరించి వాటిలోని అంతరార్థం తెలిపారన్నారు. అధ్యక్షత వహించిన సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ.. తెలుగువారి ఆరాధ్యగాయకుడు ఘంటసాల జీవిత కథను హరికథగా పాడుకునే విధంగా రచించారని అభినందించారు. బండి శంకరం, విరజానంద, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. పులివర్తి కృష్ణమూర్తి అధ్యక్షతన కవి పెద్దూరి వెంకటదాసు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. తంగిరాల చక్రవర్తి బాల గంగాధరయ్య రషీద్ స్వీయకవితలు చదివారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

4వ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


జ్ఞానేశ్వర్, గంగాధర్

మంగళ్‌హాట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 4వ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని 4వ తరగతి కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కేంద్ర సంఘం ఎన్నికల్లో ఆరోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా గడ్డం జ్ఞానేశ్వర్ ఎన్నిక కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండూరు గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం నాంపల్లి గృహకల్ప ప్రాంగణంలోని కేంద్ర సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 22న యూనియన్ కార్యాలయం భవనంలో మహా చండీయాగం నిర్వహించిన అనంతరం ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించి ఉద్యోగుల సమస్యలపై చర్చించి ప్రభుత్వంతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

డ్రమ్ముల కంపెనీలో అగ్నిప్రమాదం

రాజేంద్రనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఓ డ్రమ్ముల కంపెనీలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ద్వారా మంటలు వ్యాపించినట్లు తెలిసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేతాజీనగర్‌లోని ఏషియన్ బ్యారెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఇనుప డ్రమ్ములను తయారు చేస్తారు. వీటికి బ్లూ, గ్రీన్, రెడ్ కలర్ వేస్తారు. అలా వేసే కలర్స్‌ను నిల్వ ఉంచిన బ్యారెల్స్‌లో మంగళవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. గమనించిన కంపెనీ కార్మికులు మైలార్‌దేవుపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కృష్ణయ్య సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మైలార్‌దేవుపల్లి ఎస్ఐ తెలిపారు.